సపోట తోట దగ్ధం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: ఇరుకుల్ల గ్రామంలోని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి చెందిన ఎకరన్నర సపోట తోట ప్రమాదవశాత్తు శుక్రవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది, స్థానికులు గమనించి ట్రినిటి కాలేజీ సిబ్బందికి సమాచారం అందించగా, వారు అగ్నిమాపక వాహనానికి ఫోన్‌చేయడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. దాదాపు 150 సపోట చెట్లతోపాటు, కరెంట్ తీగలు, తోటలో ఉన్న తాడి చెట్లు కూడా కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

మక్కజొన్న పంట దగ్ధం

సైదాపూర్, ఏప్రిల్ 6: గొడిశాల గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఎకరాల్లో మక్క పంట దగ్ధమైందని గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం వివరాలు.. గొడిశాల గ్రామానికి చెందిన తాడూరి రాజ్ కుమార్ రెండు ఎకరాల్లో మక్క పంట పండిస్తున్నాడు. శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పంట మొత్తం కాలిపోయింది. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎలక్ట్రానిక్ స్టేట్స్ వితరణ

చొప్పదండి, ఏప్రిల్ 5: రాగంపేటలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు స్థానిక ఆలయ పూజారి డింగరి శ్రీనివాస్– జ్యోతి దంపతులు 15 ఎలక్ట్రానిక్ స్టేట్స్ వితరణ చేశారు. తమ కుమారుడు డింగరి సత్యనారాయణ పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమం చేపట్టిన దంపతులిద్దరినీ పలువురు అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరోజన, ఆయా నజ్మా, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలపై కోతుల దాడి

గంగాధర, ఏప్రిల్ 5: మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలపై కోతులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన ముగ్గురు ఉపాధిహామీ మహిళా కూలీలు గ్రామంలోని ప్రకృతి వనంలో మొక్కలకు పాదులు తీస్తుండగా, ఈ ఘటన జరిగింది. కోతుల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో చెట్టుకు గుద్దుకుని సంతోష అనే మహిళ గాయపడింది. గమనించిన స్థానికులు కోతులను తరిమి కొట్టి మహిళలను రక్షించారు. కాగా, అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా నిల్వఉంచిన గన్‌ఫౌడర్ పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని జాగీర్‌పల్లి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 21.30 క్వింటాళ్ల గన్‌ఫౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆరోగ్యం శుక్రవారం తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చిగురుమామిడి: శనిగరం వద్ద కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్‌టౌన్: ముగ్దుంపూర్‌కు వచ్చి వెళ్తున్న కేసీఆర్‌కు మార్గమధ్యంలో ఘన స్వాగతం పలుకుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

అధినేతకు ఘన స్వాగతం

- తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పర్యటనతో గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం

చిగురుమామిడి/ చొప్పదండి/ గంగాధర/ హుజూరాబాద్‌టౌన్/ సైదాపూర్, ఏప్రిల్ 5: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లా పర్యటన బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కేసీఆర్ పాలంబాటలో భాగంగా జిల్లాలోని ముగ్దుంపూర్‌లో ఎండిన పంటల పరిశీలనకు వచ్చిన ఆయనకు అడుగడుగునా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. కోహెడ మండలం శనిగరం స్టేజీ వద్ద స్వాగతం పలికేందుకు పార్టీ చిగురుమామిడి మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ పిలుపు మేరకు తరలివచ్చినట్లు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి. ఇందులో పార్టీ మండలాధ్యక్షుడితో పాటు జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, మండల నాయకులు ఆకవరం శివప్రసాద్, బెజ్జంకి లక్ష్మణ్, పెనుకుల తిరుపతి, సర్వర్ పాషా, బెజ్జంకి రాంబాబు, కత్తుల రమేశ్, ఎస్‌కే సిరాజ్, తోడేటి శ్రీనివాస్, దేశిని రాజయ్య, గడ్డం అనిల్ వివిధ గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులున్నారు. ముగ్దుంపూర్‌లో ఎండిన పంటల పరిశీలన అనంతరం జగిత్యాల రహదారి మీదుగా సిరిసిల్లకు బయలుదేరిన కేసీఆర్‌కు మార్గమధ్యంలో చొప్పదండి నియోజకవర్గ ప్రజలు, రైతులు ఘన స్వాగతం పలికారు. రామడుగు మండలం వెదిర వద్ద, గంగాధర మండలం కురిక్యాల వద్ద రైతులు ఎండిన పంటలను తెచ్చి చూపించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లికి వెళ్తున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వారిని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అభినందించారు. కేసీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కేసీఆర్ పర్యటనలో పాల్గొనేందుకు సైదాపూర్ మండలం నుంచి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు చంద శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు.

చొప్పదండి: వెదిరలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

గంగుల ఇంటికి కేసీఆర్

- అక్కడే నాయకులతో కలిసి భోజనం

కరీంనగర్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంట్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భోజనం చేశారు. ముగ్దుంపూర్ నుంచి సిరిసిల్ల జిల్లాకు వెళ్లే ముందు కేసీఆర్ గంగుల ఇంటికి వచ్చారు. ఆయన వెంట పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. భోజనం తర్వాత కేసీఆర్ జగిత్యాల రహదారి మీదుగా సిరిసిల్లకు వెళ్లారు. కేసీఆర్ ముగ్దుంపూర్ పర్యటనలో ఉండగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ గంగుల కమలాకర్ ఇంటికి చేరుకున్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన భోజనం చేశారు. కేటీఆర్‌తో కార్యకర్తలు సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా కనిపించారు. గంగుల ఇంట్లో బీఆర్ఎస్ రాష్ట్ర స్థాయి నాయకులు, పలువురు ఎమ్మెల్యేలు కనిపించారు.

ఉప్పొంగిన అభిమానం

చిగురుమామిడి, ఏప్రిల్ 5: బొమ్మనపల్లి వాసి కత్తుల ప్రశాంత్ యాదవ్ తన చేతిపై కేసీఆర్ ముఖచిత్రాన్ని పచ్చబొట్టుగా పొడిపించుకుని అభిమానాన్ని చాటాడు. శుక్రవారం ఆయనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ జిల్లా పర్యటనలో ఉన్న కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్లగా, ప్రశాంత్ చేతిపై వేయించుకున్న పచ్చబొట్టును చూసి అభినందించారు. తెలంగాణ ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించిన ప్రశాంత్, ప్రస్తుతం బీఆర్ఎస్వీ మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇక్కడ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, గ్రామాధ్యక్షుడు కత్తుల రమేశ్ తదితరులు ఉన్నారు.



కేసీఆర్‌కు చేతిపై పచ్చబొట్టు చూపిస్తున్న అభిమాని ప్రశాంత్

పిల్లలు లేని దంపతులకు వరం ఐవీఎఫ్

- సక్సెస్ రేట్ 75 శాతం
- పద్మజా సంతాన సాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజా
- ఘనంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలు

ఐవీఎఫ్ ద్వారా సంతానం పొందిన మహిళలతో పద్మజా సంతాన సాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజా

విద్యానగర్, ఏప్రిల్ 5 : పిల్లలు లేని దంపతులకు ఐవీఎఫ్ అనేది ఒక అద్భుత వరమని కరీంనగర్‌లోని పద్మజా సంతాన సాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజా అన్నారు. శుక్రవారం దవాఖానలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధునాతన వైద్య ప్రమాణాలు సంతాన సాఫల్యంలో సానుకూల ఫలితాలు కరీంనగర్ పద్మజా సంతాన సాఫల్య కేంద్రానికి దక్కుతాయన్నారు. 25 సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో ప్రారంభమైన ఐవీఎఫ్ సెంటర్‌లో దేశ విదేశాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి సంతానం పొందిన వారిలో ఎన్నో వేల మంది దంపతులు ఉన్నారన్నారు. ఒకేరోజులో ట్విన్స్, త్రిపులేట్స్ అయిన ఇన్ని జంటలను మీ ముందుకు తీసుకువచ్చామన్నారు. సంతానం లేక నిరుత్సాహపడుతున్న దంపతులకు ఒక నమ్మకం రావాలనేది తమ ఉద్దేశమన్నారు. పిల్లలు లేని దంపతులకు స్త్రీ, పురుషులకు పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా ఐవీఎఫ్ ఒక అద్భుత వరమన్నారు. ఐవీఎఫ్ విధానంలో భార్య అండాశయం నుంచి అండాలను బయటికి తీసి భర్త వీర్య కణాలను అండంలోకి ఇంజెక్ట్ చేసి ఇంక్యుబెట్ చేస్తామన్నారు. మూడు రోజుల తర్వాత ఫలదీకరణ చెందిన పిండాన్ని తిరిగి గర్భాశయంలో ప్రవేశపెడుతామన్నారు. ఐవీఎఫ్ చేయడానికి వాడే మందులు, డిస్పోజబుల్స్, మీడియా పరికరాలు అన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవే అయినందున ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. అంతర్జాతీయ సక్సెస్ రేటు 35 నుంచి 40 శాతం కాగా, ఇక్కడ 70 నుంచి 75 శాతం సక్సెస్‌ను ఇవ్వగలుగుతున్నామన్నారు. దీంతోనే వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి ఇక్కడికి వస్తున్నారన్నారు. గర్భధారణ అయిన వారి కళ్లలో ఆనందం చూశాక తాము పడే శ్రమ మర్చిపోయి తిరిగి మరింత ఉత్సాహంతో పని చేయాలనిపిస్తుందన్నారు. ఈ పద్ధతి గురించి ఎన్నో అపోహలు, ఆటంకాలను దాటుకుని ఫర్టిలిటిని ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ మాతృత్వాన్ని ఇస్తున్నామన్నారు. ఎన్నో ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నప్పటికీ వస్తున్న ఫలితాలే తమ అభివృద్ధికి సోపానాలు అన్నారు. వైద్యంలో వస్తున్న నూతన మెళకువలతో పాటు కొత్త టెక్నాలజీపైన దృష్టి సారించి అధిక శాతం ఫలితాల కోసం కృషి చేస్తున్నామన్నారు. తమకు సహకారాలు అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 5: మండలంలోని చెల్పూర్–తోకలపల్లి గ్రామాల ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు ఆవరణలో శుక్రవారం జన వికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం మండలాధ్యక్షుడు పంజాల తిరుపతి, ఏరియా కో ఆర్డినేటర్స్ ఖాజాబీ, లీలావతి, రజిత, సరోజన, లావణ్య, సుల్తానా, జయబునీస, మహిళలు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనలో జేబుదొంగల చేతివాటం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: మొగ్దుంపూర్‌లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనలో జేబుదొంగలు చేతివాటం చూపించారు. దుర్శేడ్ మాజీ ఉపసర్పంచ్ జేబులో నుంచి రూ.15 వేలు, నారాయణపూర్ మాజీ సర్పంచ్ అంజయ్య జేబులో నుంచి రూ.ఆరు వేలను దొంగిలిస్తుండగా, మాజీ సర్పంచ్ గమనించి పట్టుకున్నారు. స్థానికులు అతడిని చితకబాదగా, పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మధురానగర్‌కు చేరిన సైకిల్ యాత్ర

గంగాధర, ఏప్రిల్ 5 : ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హుస్నాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం గంగాధర మండలం మధురానగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కాగా, మధురానగర్ చౌరస్తాలో ప్రజలు రాజును అభినందించారు.

నేడు హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ రైతు దీక్ష

హుజూరాబాద్‌టౌన్/ వీణవంక, ఏప్రిల్ 5: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రైతులకు మద్దతుగా శనివారం రైతు దీక్ష చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్‌లోని తన నివాసంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే దీక్షలో నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాగా, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన రైతు దీక్షను విజయవంతం చేయాలని వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్/ మానకొండూర్, ఏప్రిల్ 5: నగరంలోని దాసరి విజయ గార్డెన్‌లో ఈ నెల 7న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు జక్కని సంజయ్‌కుమార్, జన్ను స్వరూప, కొంకటి శేఖర్, బోనగిరి ప్రభాకర్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో, మానకొండూర్‌లో శుక్రవారం వారు వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మేకర రవీందర్, శ్రీనివాస్‌యాదవ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో కరువుతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువుతో రైతులు నష్టపోయారని, ఎకరాకు రూ.10వేల పరిహారాన్ని ప్రభుత్వం తక్షణమే అందజేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండ రాజిరెడ్డి, సీనియర్ రైతు సంఘం నాయకులు పొనగంటి కేదారి, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, పున్నం కనకయ్య, మహేశ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంత్యుత్సవ నూతన కమిటీ

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 5: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంత్యుత్సవ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు బొరగల సారయ్య, చైర్మన్‌గా ఎండీ ఖలీద్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా మంద భిక్షపతి, గొట్టే జమదగ్ని, రొంటాల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇల్లందుల సమ్మయ్య, కార్యదర్శులుగా రావుల రాజేశ్, ఎర్ర రాజ్‌కుమార్, తూర్పాటి రాజు, దేవునూరి రవీందర్, కోశాధికారిగా ఇప్పలపల్లి చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శులుగా తులసి లక్ష్మణమూర్తి, బొడ్డు సంజీవ్, అంగిడి సాయి ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలోని అయాన్ డిజిటల్ జోన్‌లో జేఈఈ మెయిన్స్ పరీక్ష శుక్రవారం రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడుతల్లో పరీక్ష జరుగగా.. ఉదయం 678 మందికి గానూ 612 మంది పరీక్ష రాశారు. అలాగే మధ్యాహ్నం 677 గానూ 620 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని కోఆర్డినేటర్ డాక్టర్ లలితా కుమారి పర్యవేక్షించారు. పరీక్షకేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉపాధ్యాయుడిపై డీఈవోకు ఫిర్యాదు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 5 : పాఠశాల ఉపాధ్యాయులకు సంబంధించిన జీతభత్యాలు ఎల్ఎండీ కాంప్లెక్స్ అధికారి స్వాహా చేశారని ఆరోపిస్తూ, ఆ ఉపాధ్యాయుడిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. మార్చి 2022లో మెడికల్ లీవ్ వాడుకున్న ఉపాధ్యాయుల జీతాలు పెండింగ్‌లో పెట్టి, ట్రెజరీ టోకెన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇన్‌కంట్యాక్స్ సైతం అదనంగా వసూలు చేశారన్నారు. ఇలా పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సంఘాల నాయకులు తిరుపతి రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, తిరుపతి, రవి తదితరులు ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మానకొండూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సహకార అధికారి రామానూజాచార్యులు

మానకొండూర్/ చొప్పదండి, ఏప్రిల్ 5: మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం పరిధిలోని ముంజంపల్లి, మద్దికుంట, కొండపల్కల, గంగిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి రామానూజాచార్యులు శుక్రవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి కరణ్‌కుమార్, సీహెచ్‌వో లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు పాల్గొన్నారు. చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొలిమికుంట, రుక్మాపూర్, గుమ్లపూర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన సింగిల్‌విండో కార్యదర్శి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మహిపాల్‌రెడ్డి, మోహన్, ముద్దం కుమార్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నగరంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



మానకొండూర్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

కార్పొరేషన్/ కలెక్టరేట్/ తెలంగాణచౌక్/ కమాన్‌చౌరస్తా/ మానకొండూర్/ గంగాధర/ శంకరపట్నం/ వీణవంక/ కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: మాజీ ఉప ప్రధాని, బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తిప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించి గౌరవించాలని నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించి, బడుగులకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పీ నతానియేల్, మున్సిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్, కలెక్టరేట్ ఏవో సుధాకర్‌తో పాటు ఇతర అధికారులు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. కలెక్టరేట్ సమీపంలో గల తెలంగాణ అల్పసంఖ్యాక వర్గాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సంఘం జిల్లా కార్యదర్శి మైసని రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు ఆజాద్, రమణ, ఆవుల రాంబాబు, మ్యాన మహేందర్, తవుటు రాజేశంతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో గల సమావేశ మందిరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ చంద్రయ్య, డీఎంలు మల్లేశం, మల్లయ్య, ఏటీఎం రజినీకృష్ణ పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా 'సమతా దివస్'ను ఎస్‌టీయూ తెలంగాణ, పెటా తెలంగాణ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రవి, పెటా రాష్ట్ర బాధ్యుడు కొమురోజు కృష్ణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, తెలంగాణ బాధ్యులు కనకం సమ్మయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల చౌరస్తాలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ పూలమాల వేసి నివాళులర్పించారు. మానకొండూర్ మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నందగిరి రవీంద్రాచారి, కోండ్ర శంకర్, రొడ్డ అంజి, కోండ్ర సురేశ్ తదితరులు పాల్గొన్నారు. గంగాధర మండలం మధురానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గంగాధరలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగాధరలో బీఆర్ఎస్ నాయకులు, మధురానగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంతోపాటు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా,